క్లుప్తంగా

నేడు కామాక్షితాయి కల్యాణోత్సవం

ఇందుకూరుపేట : గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో జొన్నవాడ కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం మంగళవారం జరుగుతుందని ఆలయ ఈఓ శాంతయ్య సోమవారం తెలిపారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను జొన్నవాడ నుంచి ఆలయం వద్దకు తీసుకొచ్చి కల్యాణోత్సవం జరిపిస్తామని వెల్లడించారు.

హైవే క్రాసింగ్‌పై రాళ్ల తొలగింపు


క్రాసింగ్‌కు అడ్డుగా వేసిన రాళ్లను తొలగిస్తున్న రైతులు

కొడవలూరు : మండలంలోని నార్తురాజు పాళెం టపాతోపు హైవే క్రాసింగ్‌పై హైవే అథారిటీ వారు అడ్డుగా వేసిన రాళ్లను స్థానిక రైతులు సోమవారం స్వచ్ఛందంగా తొలగించారు. ఈ సందర్భంగా డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, స్థానిక రైతులు మాట్లాడుతూ నార్తురాజుపాళెం రైతులకు చెందిన వ్యవసాయ భూములు రోడ్డుకు అవతల ఉందని తెలిపారు. హైవే అథారిటీ వారు వేసిన బాక్స్ టైప్ బ్రిడ్జి నిరుపయోగంగా మారిందన్నారు. ప్రణాళిక లేకుండా నిర్మించడం వల్ల బ్రిడ్జిలో ఏడాది పొడవునా నీరు నిలిచి ఉండడంతో రాకపోకలు సాగించలేకపోతున్నట్లు తెలిపారు. రైతులు తమ పొలాల్లోకి ట్రాక్టర్లతో వెళ్లాలంటే క్రాసింగ్ మూసి వేయడం వల్ల ఐదు కి.మీ దూరంలోని కోవూరు బ్రిడ్జి నుంచి వెళ్లాల్సి వస్తోందని, హైవే అధికారులు హామీ ఇచ్చినట్లుగానే ప్రత్యామ్నాయం చూపాకే క్రాసింగ్ మూయాలే తప్ప హఠాత్తుగా మూసి వేయడం వల్ల ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని తొలగించారని, ప్రత్యామ్నాయం చూపాకే క్రాసింగ్ మూసి వేయాలని డిమాండ్ చేశారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి


మాట్లాడుతున్న బాపిరెడ్డి

కోవూరు : నియోజకవర్గ పరిధిలోని బీఎల్వోలు(బూత్ లెవల్ అధికారులు) బాధ్యతగా విధులు నిర్వహించాలని కోవూరు ఎన్నికల రిటరింగ్ అధికారి బాపిరెడ్డి తెలిపారు. కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఆయన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలను వదిలి వెళ్లిన వారు, మృతిచెందిన వారి వివరాల తొలగింపు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారిని డిసెంబర్ 9వ తేదీలోగా ఓటు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ పద్మజ, ఎంపీడీఓ శ్రీహరి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నావూరు రహదారికి మహర్దశ

- పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కూడా నిధుల మంజూరు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేగంగా అభివృద్ధి


దెబ్బతిన్న నావూరు రోడ్డు

పొదలకూరు : మండలంలోని నావూరు రహదారి ఆధునికీకరణకు నోచుకోనుంది. ఎన్నో ఏళ్లుగా దెబ్బతిన్న రోడ్డుకు గతంలో తాత్కాలిక మరమ్మతులే చేపట్టారు. అంతే కాకుండా నావూరుకు సమీపంలో పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం ఏడు గ్రామాల ప్రజల కలగా మిగిలింది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి కూడా నిధులు మంజూరు కావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు పెద్దవాగు పొంగి ప్రవహిస్తే నావూరు, నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, కొండలరాయుడుకండ్రిగ తదితర గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించేవి. రోడ్డు నిర్మాణ పనులు, బ్రిడ్జి పనులు పూర్తయితే గ్రామాల మధ్య సుఖవంతమైన ప్రయాణం ఉంటుంది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ పనుల కోసం రూ.కోట్లాది నిధులు మంజూరు చేయించి త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి రెండు, మూడు మాసాల్లో పూర్తి చేయించనున్నారు.

రూ.14.45 కోట్లు మంజూరు

సంగం–పొదలకూరు మెయిన్ రోడ్డు నుంచి వయా ప్రభగిరిపట్నం, నావూరు, చెన్నారెడ్డిపల్లి, కండలరాయుడుకండ్రి వరకు 20 కి.మీ మేర రూ.10.83 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మార్గమధ్యలో నావూరు వద్ద పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.62 కోట్ల నిధులు విడుదల చేస్తూ జీఓ నంబర్ 788 ను ప్రభుత్వం విడుదల చేసింది. గతంలో ఎందరు నాయకులు వచ్చినా బ్రిడ్జి కోసం నిధులు సాధించింది లేదు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా అప్పటి టీడీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుండడంతో మంత్రి కాకాణి నిధులు మంజూరు చేయించారు. దీంతో మండలంలో దాదాపుగా రోడ్లలన్నీ బాగుపడినట్లు అవుతుంది.


పెద్దవాగుపై చప్టా

ఎన్నో ఏళ్ల కల నెరవేరింది



ఎన్నో ఏళ్లుగా కలగా ఉన్న పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం ఎట్టకేలకు నెరవేరనుంది. ఇది సాకారమయ్యేలా కృషి చేసిన మంత్రి కాకాణికి గ్రామస్తులంతా కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నాం. ఎప్పుడో ఆత్మకూరు ఎమ్మెల్యే సుందరరామిరెడ్డి హయాంలో వాగుపై చప్టా నిర్మించారు.
– నోటి బాలకొండారెడ్డి, చెన్నారెడ్డిపల్లి

రాకపోకలు కష్టంగా ఉంది



నావూరు రోడ్డు బాగా దెబ్బతినడం వల్ల రాకపోకలు సాగించడం కష్టంగా ఉండేది. రోడ్డు పనులు పూర్తయితే సుఖవంతమైన ప్రయాణం చేయవచ్చు. నిధులు సాధించిన మంత్రి కాకాణికు కృతజ్ఞతలు. మరో మార్గంలో అమ్మవారిపాళేనికి ఇటీవల రోడ్డు నిర్మాణ పనులు పూర్తయింది.
– సీహెచ్ రమేష్, నావూరుపల్లి

పనులు వేగంగా చేపడతాం

టెండర్ల ప్రక్రియ పూర్తయితే వేగంగా పనులు చేపడుతాం. అయ్యగారిపాళెం మీదుగా ఇటీవల అమ్మవారిపాళెం వరకు ఏఎంసీ నిధులతో రోడ్డు పనులు పూర్తి చేశాం. మరో నెలరోజుల్లో కొత్త పనులను చేపట్టే అవకాశం ఉంది.
– మవేక్‌రెడ్డి, పీఆర్ ప్రాజెక్ట్ ఏఈ

పట్టాల పంపిణీకి రంగం సిద్ధం


పట్టాలకు సంబంధించి సంతకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు : స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో 99 మంది సాగు అనుభవదారులకు పట్టాల పంపిణీకి రంగం సిద్ధమైంది. మండలంలోని పెయ్యలపాళేనికి చెందిన 99 మంది రైతులు సుమారు 50 ఎకరాలను 35 ఏళ్లుగా సాగు చేసుకొంటున్నారు. ఈ భూమికి సంబంధించి సాగుదారులకు ఎలాంటి పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ రాయితీలకు దూరమవుతూ ఇబ్బందులెదుర్కొంటున్నారు. గతంలో ఎంతో మంది అధికారులు, నేతలకు రైతులు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సన్నకారు రైతులందరికీ పట్టాలిప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి అనుభవదారులుగా ఉన్న వారికి పట్టాలిప్పించేలా చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్ అయిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పట్టాలకు సంబంధించిన ఫైల్ పై తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సమక్షంలో నార్తురాజుపాళెంలో సోమవారం సంతకాలు చేశారు. దాదాపు పట్టాల ప్రక్రియ పూర్తి కావడంతో త్వరలోనే రైతులందరికీ పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్నకు డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గండవరం సొసైటీ చైర్మన్ పెనాక నాగశ్రీనివాసులురెడ్డి, పార్టీ నేతలు కె.సుమన్, ఎస్.మాణిక్యరావు, శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మల్లికార్జునస్వామి దేవస్థానానికి టీటీడీ నిధులు


మల్లికార్జునస్వామి దేవస్థానం

పొదలకూరు : మండలంలోని కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం అభివృద్ధికి టీటీడీ నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి. శ్రీవాణి ట్రస్ట్, సమరసత సేవాసమితి ఆధ్వర్యంలో తొలివిడతగా రూ.6.35 లక్షల చెక్కును దేవస్థానం పాలకమండలికి అందజేసినట్లు గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. రెండో విడతలో మిగిలిన నిధులను అందజేస్తారన్నారు. దేవస్థానం నిర్మాణానికి, అభివృద్ధి పనులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృషి చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణికి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఏటీఎం సాగుతో అధిక లాభాలు

- ప్రకృతి వ్యవసాయ టెక్నికల్ కోఆర్డినేటర్ రవిచంద్ర ప్రసాద్


మహిళా సంఘాలకు ఏటీఎం సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొడవలూరు : ఏటీఎం మోడల్ సాగు పద్ధతిలో తక్కువ భూమిలోనే అధిక లాభాలు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ టెక్నికల్ కో–ఆర్డినేటర్ రవిచంద్ర ప్రసాద్ తెలిపారు. మండలంలోని తలమంచిలో శ్రీకాంత్ అనే రైతు పొలంలో పొదుపు సంఘాల మహిళలకు ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయంపై సోమవారం క్షేత్రస్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనీటైమ్ మనీ(ఏటీఎం) పేరుతో ఈ మోడల్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహమిస్తోందన్నారు. ఈ పద్ధతిలో 20 సెంట్ల భూమిలోనే 20 రకాల పండ్లు, కూరగాయలు, పూల మొక్కలను పెంచవచ్చన్నారు. ఇలా సాగు చేయడం వల్ల రైతు 20 సెంట్ల భూమితోనే నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు సంపాదించగలరని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా సాగు చేయించడం ద్వారా ప్రతి రైతు ఆచరించేలా చేయడం లక్ష్యమన్నారు. ఒక్కో మండలంలో పది మంది మహిళా రైతులతో ఈ పద్ధతిలో సాగు చేయించడం లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.రుక్మిణి, సీసీలు కె.ఉదయ్‌కుమార్, శ్రీదేవి, సుకన్య, శోభ, వీఓఏ పాల్గొన్నారు.

పనుల్లో పారదర్శకత ముఖ్యం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్

కోవూరు : ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 157 అంగన్‌వాడీ భవనాలను నాడు–నేడు రెండో దశ కింద మరమ్మతులు చేసేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయని, పనుల్లో పారదర్శకత అవసరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ అన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ కార్యాలయ సమావేశ మందిరంలో నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సోమవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు–నేడు రెండో దశ పనులకు సంబంధించి ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా వీటికి సంబంధించి బ్యాంక్ ఖాతాలను కూడా ఓపెన్ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సీడీపీఓ జ్యోతి, ఏసీడీపీఓ అరుణ, సూపర్‌వైజర్లు బి.శకుంతల, ఎ.రాధిక, ప్రమీల, ప్రసన్న, సుమిత్ర, నిర్మలా, నాగభూషణమ్మ ఉనారు.

ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యదర్శిగా రాము


అభినందనలు తెలుపుతున్న సంఘ నేతలు

విడవలూరు : విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ ఎన్నికల్లో మండలంలోని ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఎమ్.రాము ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయ సంఘ నేతలు వి.కృష్ణ, ఎస్.శ్రీనివాసులు, పి.సతీష్, విజయభాస్కర్‌రెడ్డి సోమవారం అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు.

‘ఆడుదాం ఆంధ్రా’పై ప్రచారం చేయండి

- డీపీఓ సుస్మితారెడ్డి


క్రీడల వివరాలు వెల్లడిస్తున్న డీపీఓ సుస్మితారెడ్డి

ముత్తుకూరు : రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ‘ఆడుదాం ఆంధ్రా’ కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని డీపీఓ, సర్వేపల్లి నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎం.సుస్మితారెడ్డి అన్నారు. ముత్తుకూరు సచివాలయంలో ఎంపీడీఓ లక్ష్మణకుమార్, ఎంఈఓ మధుసూదన తదితర అధికారులతో ‘ఆడుదాం ఆంధ్రా’ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ క్రీడాపోటీల్లో పాల్గొనే వారు డిసెంబరు 2వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. డిసెంబర్ 12 నుంచి క్రీడా పోటీలు మొదలవుతాయన్నారు. ఈ అంశాన్ని వలంటీర్లు విస్తృతంగా ప్రచారం చేసి, క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడల్లో పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో నాలుగు టీమ్‌లు రిజిస్ట్రేషన్ అయ్యేలా చూడాలని అధికారులను సూచించారు. పంచాయతీ కార్యదర్శి చక్రం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటనపై నవాబుపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బంగ్లాతోటలో రాఘవరెడ్డి కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన భార్యకు అనారోగ్యంగా ఉండడంతో ఇంటికి తాళం వేసి భార్యను చికిత్స నిమిత్తం పది రోజుల కిందట చెన్నైకు తీసుకెళ్లారు. ప్రతిరోజూ పనిమనిషి వెంకమ్మ ఇంటికి వచ్చి వాకిలి శుభ్రం చేసి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆమె వాకిలి శుభ్రం చేసేందుకు రాగా వెనుకవైపు తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో అనుమానం వచ్చి జరిగిన విషయాన్ని ఇంటి యజమానికి తెలియజేసింది. సోమవారం ఆయన నెల్లూరుకు చేరుకుని ఇంట్లో పరిశీలించగా బీరువాలోని రూ.లక్ష విలువైన బంగారు ఆభరణాలు, ఇంటి ఆవరణలో పార్క్‌చేసి ఉన్న స్కూటీ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేదీప్యం.. కార్తీక దీపోత్సవం


పొదలకూరు : వెంకటేశ్వరస్వామి ఆలయంలో దీపాలంకరణ


మనుబోలు : సంగమేశ్వరాలయంలో కామాక్షితాయి


మనుబోలు : ప్రత్యేకాలంకరణలో సంగమేశ్వరుడు


పొదలకూరు : ప్రత్యేకాలంకరణలో వినాయకుడు

మనుబోలు : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో సోమవారం కార్తీక దీపోత్సవం దేదీప్యమానంగా జరిగింది. మండల పరిధిలోని కండలేరు ఒడ్డున వెలసిన కామాక్షితాయి సమేత సంగమేశ్వరాలయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. మనుబోలు నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి ఆలయానికి చేరుకున్న మహిళలు ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి పూజల్లో పాల్గొన్నారు. అర్చకుడు ఫణీంద్ర శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే మనుబోలు, బద్దెవోలు, పిడూరుపాళెం, వెంకన్నపాళెం, కొలనకుదురు, పిడూరు, మడమనూరు, చెర్లోపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

మల్లికార్జునస్వామి దేవస్థానంలో..

పొదలకూరు : మండలంలోని మరుపూరులో ఉన్న మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవస్థానంలో సోమవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు.

- పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శంకు చక్ర రూపాలతో మహళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- మండలంలోని పార్లపల్లిలో ఉన్న వినాయకస్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గురునాథస్వామి దేవస్థానంలో..

విడవలూరు : మండలంలోని తుమ్మగుంటలో ఉన్న గురునాథస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం అయ్యప్పస్వాములు పడి పూజ నిర్వహించారు. అర్చకుడు భట్టారం చంద్రశేఖర్ తొలుత స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యర్రంశెట్టి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా..

కోవూరు : మండల కేంద్రంలోని గాంధీ పార్కు సెంటర్లో ఉన్న కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి నేపథ్యంలో మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అనంతరం ఆలయ అర్చకుడు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను జరిపించారు. ఈ సందర్భంగా 11 వేల బాల లింగాలకు సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బి.సురేష్, ధర్మకర్తల మండలి సభ్యులు మోహన్, హనుమారెడ్డి, అర్చకులు శేఖర్‌స్వామి, సుబ్బయ్యస్వామి, మురళీస్వామి తదితరులు ఉన్నారు.


పొదలకూరు : మల్లికార్జునస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


విడవలూరు : జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆలయ సభ్యులు


కోవూరు : మల్లికార్జునస్వామి దేవస్థానంలో..

భారీ వర్షం.. రైతన్నకు ఊరట


మనుబోలు : కండలేరులో జలకళ


పొదలకూరులో భారీ వర్షానికి జలమయమైన రోడ్డు

పొదలకూరు : చాలారోజుల తర్వాత మండల కేంద్రమైన పొదలకూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. వీధుల్లో రోడ్లలన్నీ జలమయం అయ్యాయి. ఈ రబీ సీజన్‌కు వర్షపాతం చాలా తక్కువగా నమోదైన క్రమంలో భారీ వర్షం కొంతవరకు ఊరటనిచ్చింది. నార్లు పోసుకున్న రైతులకు సైతం భారీ వర్షం ఎంతో ఉపయోగపడింది. చుట్టుపక్కల నిమ్మ, జామాయిల్, సవక తోట రైతులకు వర్షం వల్ల ఊరట కలిగింది.

కండలేరుకు జలకళ

మనుబోలు : మండల పరిధిలో సోమవారం భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో మండలంలోని వాగులు, వంకలు నీటితో నిండిపోయాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరకు వర్షాలు లేకపోవడంతో కండలేరుకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ నీటికి వర్షపు నీరు కూడా కలవడంతో కండలేరు జోరుగా ప్రవహిస్తోంది. ఇప్పటికే నారుమళ్లు వేసిన రైతులు నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.